క్లుప్తంగా

బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం నేడు ప్రారంభం

బోట్‌క్లబ్: గాయత్రి ఆర్ష సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో ఆదివారం బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం ప్రారంభించనున్నట్లు సమితి చైర్మన్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ యువత వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత జోడించి పలు అంశాలను అనుసంధానం, వివిధ వృత్తిదారుల ద్వారా చేస్తూ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకూ పని చేస్తుందన్నారు. వధూవరుల బయోడేటాను ఆర్గనైజర్ పీవీఎస్ మూర్తి 9441767318 నంబర్‌కు పంపవచ్చన్నారు.

భీమేశ్వరాలయంలో నేటి నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. శనివారం ఆలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 22న గాయత్రీదేవి, 23 విజయలక్ష్మీదేవి, 24న సరస్వతీదేవి, 25, 26 తేదీల్లో రాజరాజేశ్వరిదేవి, 27 అన్నపూర్ణాదేవి, 28 కాళికాదేవి, 29 కనకదుర్గ, 30 చాముండీదేవి, 1న మహిషాసురమర్ధిని, 2న బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిస్తారన్నారు.

వీధి విక్రయదారుల కోసం లోక కల్యాణ మేళాలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ప్రధానమంత్రి స్వనిధి పథకంలో అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో వీధి విక్రయదారులు కోసం లోక కల్యాణ మేళాలు నిర్వహిస్తున్నట్లు మెప్మా పీడీ బి.ప్రియంవద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలు ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేళాలు కాకినాడ నగరపాలకసంస్థ, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల్లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మేళాలో అర్హులైన వారికి వీధి విక్రయదారుల గుర్తింపు, గుర్తింపు కార్డుల పంపిణీ, అర్హులైన వారికి బ్యాంకు రుణ సదుపాయం, డిజిటల్ పేమెంట్‌పై అవగాహన, ఫుడ్ లైసెన్స్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ మేళాలో బ్యాంకు మేనేజర్లు, ఆరోగ్యశాఖ, ఫుడ్ లైసెన్సింగ్ అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొంటారన్నారు.

జనసేన ముఖ్యనేతల భేటీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన కాకినాడ సిటీ నియోజకవర్గ నేతలు స్థానిక ఐఎంఏ హాల్లో శనివారం సమావేశం అయ్యారు. కొందరు నాయకులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు అంటూ సమావేశంలో నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లైస్ చైర్మన్ తోట సుధీర్లకు వ్యతిరేకంగా వారు సమావేశం అయినట్లు పార్టీ నేతల ద్వారా తెలిసింది. నామినేటెడ్, పార్టీ పదవుల విషయంలో పార్టీ జెండా మోసే వారిని విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం వివిధ పార్టీల నుంచి జనసేనలో చేరిన నేతకు కాకినాడ సిటీ అధ్యక్ష పదవి కట్టబెడుతున్నారనే విషయంపై చర్చించారు. సమావేశంలో పార్టీ నేతలు బాబ్జీ, ఆదినారాయణ, సీహెచ్ కిరణ్, ఎం.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతివర్ధనలో ఎంఎల్‌ఎస్ కమిటీ తనిఖీలు

పెద్దాపురం: పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు అందుతున్న సేవలపై ప్యానల్ లాయర్ అత్తిలి ప్రభుజీ, పారా లీగల్ వలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, వీఎస్ఎన్ మూర్తి, కుంచే నానిబాబు, లక్ష్మి బృందం ఆరా తీసింది. శాంతివర్ధన సంస్థ విద్యార్థులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం దివిలి ఎస్సీ, బీసీ హాస్టల్స్‌ను తనిఖీ చేసి అక్కడ అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

వేతన యాతన

- చేసిన పనులకు అందని వేతనాలు
- పనులు లేక కూలీలకు పస్తులు
- కొత్తగా జాబ్ కార్డులు ఇవ్వని అధికారులు
- వారి పనితీరుపై కూలీల నిరసన



కరపలో వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

కరప: గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికులకు పనులు కల్పించి, ఉపాధి కల్పిస్తామని చేస్తున్న అధికారుల ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు చెప్పాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పస్తులుంటున్నామని ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి 100 రోజులు పని దినాలు కల్పిస్తామంటున్న హామీల మాట దేవుడెరుగు నాలుగైదు వారాలు కూడా పనిచెప్పడం లేదని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు వ్యవసాయ పనులు లేక ఇటు ఉపాధిపనులు దొరక్క నానా అవస్థలు పడుతున్నామని వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కూలీలు ఆరోపిస్తున్నారు. చేసిన అరకొర పనులకు కూడా వేతనాలు చెల్లించక మూడు నెలలుగా అప్పులు చేసి కడుపు నింపుకోవాల్సి వస్తోందని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రూపులకు పనులు చెబుతున్న అధికారులు తమను ఎందుకు పట్టించుకోవడం లేదని కరప గ్రామ ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రమైన కరప గ్రామంలోని ఉపాధి కూలీల పరిస్థితి దయనీయంగా తయారైంది. గ్రామంలో 200 మందికి జాబ్ కార్డులుండగా ఎక్కువగా 190 మంది వరకూ పనులకు వస్తుంటారు. గతంలో ఆకుతీతలు, ఊడ్పులు, కోతలు, కుప్పనూర్పులు వంటి వ్యవసాయ పనులు చేసుకునేవారమని, ఇప్పుడు రైతులంతా యంత్ర పరికరాలతో పనులు చేసుకుంటున్నారన్నారు. దీంతో అటు వ్యవసాయ పనులు లేక, ఇటు ఉపాధి పనులు లేక కడుపు నింపుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని తమ బాధలు చెప్పుకున్నారు. ఉపాధి పథకం సిబ్బందిని అడుగుతుంటే పనులు గుర్తించి, ప్రతిపాదనలు పంపామని, మంజూరు రాగానే పనులు చెబుతామంటున్నారే కానీ నెలరోజులుగా ఒక్క రోజు కూడా పనిచెప్పలేదని ఉపాధి కూలీలు ఆరోపించారు.

ఖాతాల్లో జమ కాని సొమ్ము

మండలంలో 23 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా వివిధ రకాల పనులు చేయించారు. పనులు చేసి 6 నుంచి 12 వారాలైనా వేతనాలు చెల్లించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల్లోనే వేతనాలు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామంటున్నారే కాని కనబడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కష్టపడి పనిచేసిన వానికి వేతనాలు చెల్లించకుండా కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వేతనాలు చెల్లించక పూట గడవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని ఉపాధి పథకం శ్రామికులు అంటున్నారు.

కొత్తగా జాబ్ కార్డులేవీ?

జాబ్ కార్డులున్న వారికి ఉపాధి కల్పించడం లేదు. పనిచేసిన వారికి వేతనాలు చెల్లించడం లేదు. ఇదెక్కడి ఉపాధి పథకం అని శ్రామికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గ్రామాలకు సమానస్థాయిలో ఉపాధి పనులు కల్పించాలని, చేసిన పనులకు వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఉపాధిహామీ పథకం వేతనదారులు కోరుకుంటున్నారు.

జాబ్ కార్డు ఉన్నా పని చెప్పడం లేదు



జాబ్ కార్డు ఇచ్చారు. 6 నెలలుగా పనిచెప్పాలని తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఫీల్డు అసిస్టెంట్ను అడుగుతుంగే రేపు మాపు అంటూ తిప్పుతున్నారే కానీ ఒకరోజూ కూడా పని చెప్పలేదు. ఉపాధిపనులు చెప్పక ఖాళీగా ఉంటున్నాం. అధికారులు స్పందించి ఉపాధిపథకంలో పనికల్పించి, ఆదుకోవాలి.

– కలింక పెదసత్తిరాజు, కరప

ఎవరూ పట్టించుకోవడం లేదు



జాబ్ కార్డు కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఉపాధి లేక ఇబ్బందిగా ఉంటోందని, పని కల్పించేందుకు జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వ్యవసాయ పనులు లేక, ఉపాధి పథకంలో పని కల్పించక చాలా ఇబ్బంది పడుతున్నామని వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి జాబ్ కార్డులు మంజూరు చేసి, ఉపాధి కల్పించాలి.

– మద్దూరి వెంకటేశ్వరరావు, కరప

కౌలు రైతులకు కరపత్రాల పంపిణీ



యండమూరులో చలో విజయవాడ కరపత్రాలను ప్రదర్శిస్తున్న కౌలు రైతులు, సంఘ నాయకులు

కరప: కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 22న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో కౌలు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వి.రాజబాబు పిలుపునిచ్చారు. మండలం వేళంగి, యండమూరు, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు గ్రామాల్లో శనివారం వారు పర్యటించి, కౌలు రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని, కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీకి ర్యాలీ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర సంఘం తలపెట్టిందన్నారు. 22న ఉదయం 10 గంటలకల్లా విజయవాడకు చేరుకోవాలని, అక్కడ నుంచి అసెంబ్లీ వరకు కౌలు రైతులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని సంఘనాయకులు తెలిపారు. ఎం.వీరబాబు, జి.సత్తిబాబు, ఎస్.వెంకటసూకరాజు, బి.అప్పన్న, ఎస్.ప్రసాద్, ఎస్.వెంకటరమణ, తదితర కౌలు రైతులు పాల్గొన్నారు.

శ్రీపీఠంలో మహాశక్తి యాగం కోసం ఏర్పాట్లు



హోమాల కోసం నిర్మించిన యాగశాల



భక్తులు కూర్చునేందుకు ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్న నిర్వాహకులు

కాకినాడ రూరల్: వేలాది మంది మహిళలు లలితా సహస్ర నామార్చనలతో ఒక క్రతువులా సాగించే వంద కోట్ల కుంకుమార్చనలకు రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పరిపూర్ణానంద స్వామి ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రుల్లో ప్రత్యేక హోమాలు, ఐశ్వర్యాంబికకు అలంకరణ, కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. రోజుకు సుమారుగా 35 వేల నుంచి 40 వేల వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. కుంకుమార్చనలకు భారీ షెడ్లతో పాటు భక్తులకు అన్న ప్రసాదం అందించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం రెండు వేల మంది వరకు సేవ చేసేందుకు శ్రీపీఠంలో నమోదు చేసుకున్నారు. కాకినాడ జిల్లాలో లలితా సహస్ర నామార్చనలు మారు మోగేలా ఏర్పాట్లు చేయడంతో దసరా వేడుకలు ప్రారంభోత్సవం కోసం భక్తులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

భద్రత ఏర్పాట్లు పటిష్టం

శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ పీఠం ఐశ్వర్యాంబిక ఆలయంలో నిర్వహించే కార్యక్రమాల భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ పరిశీలించారు. కాకినాడ సబ్ డివిజన్ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీ కేవీ సత్యనారాయణ, సర్పవరం సీఐ, శ్రీ పీఠం నిర్వాహకులు ప్రూటీ కన్నా ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కుంకుమార్చనలో భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు పోలీసు బలగాలు నియమించామన్నారు. ముఖ్య ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసి, పార్కింగ్ ప్రాంతాలు ముందుగానే గుర్తింపు చేసినట్టు తెలిపారు. మహిళ భక్తుల భద్రత కోసం మహిళా కానిస్టేబుళ్లను ప్రత్యేకంగా నియమించినట్టు చెప్పారు. అన్నప్రసాద కేంద్రాల వద్ద తోపులాటలు జరగకుండా పోలీసు సిబ్బంది నియమించినట్టు తెలిపారు. వేడుకల ప్రాంగణంలో ఫైర్ సేఫ్టీ ఎక్విప్మెంట్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ ఏర్పాటు చేయడాన్ని పరిశీలించారు. ఫైర్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాదం తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఆరోగ్య శాఖలతో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రతి భక్తుడూ శ్రీ పీఠం కార్యక్రమాల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్న రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో హ్యాపీ స్కూల్స్ ప్రాజెక్టులో భాగంగా స్థానిక పీఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్కూల్ టాపర్స్‌గా నిలిచిన ముగ్గురికి శనివారం స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. హ్యాపీ స్కూల్స్ ప్రాజెక్ట్ చైర్మన్ చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ ఏటా పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన ముగ్గురికి క్లబ్ సభ్యుల సహకారంతో స్కాలర్‌షిప్ ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. స్కాలర్‌షిప్‌ల మొత్తాన్ని మాజేటి పవన్, డాక్టర్ సానా ప్రవీణ్, చంద్రరావు స్పాన్సర్ చేశారని చిరంజీవిరెడ్డి వివరించారు. నవ్య సుష్మశ్రీ, సీహెచ్ సహస్ర, కె.ప్రియదుర్గాలకు రూ.5 వేలు చొప్పున అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అందిస్తున్న సహకారం వల్ల విద్యా ప్రగతితో పాటు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, సభ్యులు నేతి నాగేశ్వరరావు, భూపేంద్ర, లంక సాయిబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



వేళంగి హైస్కూలులో గ్రామస్తులతో కలసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రామ్‌స్వరూప్-జవహర్ దంపతులు

కరప: మండలంలోని వేళంగిలో మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సర్పంచ్ సవిలే నీలిమ, రాజేష్ దంపతులు సొంతనిధులతో సమకూర్చిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని డాక్టర్ కాకర రామ్‌స్వరూప్ జవహర్ దంపతులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను తొలగించేందుకు పాటుపడిన మహోన్నతుడు అంబేడ్కర్ అన్నారు. ఆ మహనీయుని విగ్రహాన్ని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సర్పంచ్ నీలిమ దంపతులను అయన అభినందించారు. ముందుగా బౌద్ధవివాహకర్త, ఉపాసక గిడ్ల వీరప్రసాద్ బుద్ధ వందనం చేశారు. హైస్కూలు అభివృద్ధి కమిటీ చైర్మన్ మెర్ల వీరయ్యచౌదరి, లయన్ డాక్టర్ బొండా వెంకన్నరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ పాకా చంద్రరావు, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, హెచ్ఎం రాపర్తి త్రిమూర్తులు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బౌద్ధ ఉపాసకులు పి.నరసింహమూర్తి, సేల్స్‌టాక్స్ ఆఫీసర్ సాంబత్తుల వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

46 సీసీ కెమెరాల వితరణ

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పోలీస్ విభాగానికి మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ తమ ఫౌండేషన్ తరఫున 46 సీసీ కెమెరాలు వితరణ ఇచ్చింది. శనివారం సంస్థ ప్రతినిధులు జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు ఈ కెమెరాలు అందజేశారు. వీటి విలువ రూ.4.4 లక్షలని ఎస్పీ అన్నారు. ఈ సీసీ కెమెరాలను ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం సమాజ శ్రేయస్సులో తమ వంతు పాత్ర పోషించి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారని కొనియాడారు. కార్పొరేట్ సంస్థలు ప్రజా శ్రేయస్సు కోసం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్‌తో

మహిళా సాధికారత



నడకుదురులో స్వస్థ్ నారీ వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఏంజెలిన్

కరప: ఆరోగ్యవంతమైన మహిళలు బలమైన కుటుంబం కోసం తద్వారా మహిళా సాధికారత సాధించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందని మండల వైద్యాధికారి వి.ఏంజెలిన్ అన్నారు. మండలం నడకుదురులో శనివారం స్వస్థ్ నారీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అనేక ఆరోగ్య సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా బలపడితే కుటుంబమంతా సంతోషంగా ఉంటుందన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి, వైద్యం అందిస్తే దానిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. మహిళల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరంలో వైద్యసిబ్బందితో కలసి డాక్టర్ ఏంజెలిన్ మహిళలకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ దేగల లలితకుమారి, గ్రామస్తులు సింగంపల్లి నాగేశ్వరరావు, భాస్కర్ తమ్మాయ్, మెండు గోవిందు, ఆప్తమాలజిస్ట్ కె.చంద్రశేఖర్ తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి



కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద పోలీసు గెస్ట్ హౌస్‌లో మొక్క నాటుతున్న ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని డీఆర్వో జె.వెంకటరావు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని పరిసరాలను శుభ్రం చేశారు. గ్రీన్ ఏపీ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, వికాస పీడీ లచ్చారావు పాల్గొన్నారు.

కరపలో..

కరప: పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, అందుకు గ్రామపంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలలో, రోడ్ల పక్కన, గృహాల ఆవరణలో మొక్కలు నాటాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ కార్యదర్శి యు.నిర్మలాదేవి, సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కలసి ఆయన ర్యాలీ నిర్వహించి తడి, పొడిచెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మొక్క నాటిన ఎస్పీ

కాకినాడ రూరల్: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పవరం జంక్షన్ వద్ద పోలీసు గెస్ట్ హౌస్ ప్రాంగణంలో శనివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బింధుమాధవ్ మొక్క నాటారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సూర్యారావుపేట బీచ్‌లోను చెత్త తొలగింపు కార్యక్రమంలో తమ సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, అదనపు ఎస్పీ బి.శ్రీనివాసరావు(ఏఆర్), స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐలు పాల్గొన్నారు. రమణయ్యపేట గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ఎంపీడీఓ సతీష్, ఈవోపీఆర్డీ సీతారామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు పాల్గొన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో భాగంగా ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు చెత్తను తొలగించి, పండ్లు, కూరగాయల కోసం ఆర్గానిక్ విత్తనాలు నాటారు.

ఓటర్ల నమోదుపై బీఎల్వోలకు శిక్షణ



కరపలో బీఎల్ఓల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లిబాబు, ఎన్నికల అధికారి సురేష్

కరప: ఎన్నికల నిబంధనల మేరకు బీఎల్ఓ ఇంటింటా సర్వే చేసి హెల్దీ ఓటర్ల జాబితా తయారు చేయాలని కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం బీఎల్ఓ, రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. 2002, 2025 ఓటర్ల జాబితా ఇవ్వడం జరుగుతుందని దాని ప్రకారం సర్వే చేయాలన్నారు. 2025 ఓటర్ల జాబితాలో కొత్తగా చేరిన ఓటర్ల వివరాలను నిశితంగా పరిశీలించి, నిబంధనల మేరకు ఐటెండిటీని గుర్తించి, కొత్తజాబితా రూపొందించాలన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి సురేష్ బీఎల్ఓలకు ఇంటింటా సర్వే ఎలా చేయాలి, వారి వివరాలు సేకరించడంలో అనుసరించాల్సిన విధి విధానాలపైన, పోలింగ్ స్టేషన్ల పరిధిలో మార్పులు, చేర్పులు జరిగాయా, జరిగితే ఎందుకు జరిగాయో పరిశీలించి, నిర్దేశించిన ఫార్మాట్లలో ఎలా నమోదు చేయాలో శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, డీటీ జి.దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్, ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో సమీక్ష

కాకినాడ రూరల్: బూత్ లెవెల్ అధికారులతో కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు సమీక్ష నిర్వహించారు. శనివారం రమణయ్యపేట మోహన్ కాన్వెంట్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రారంభం కానున్నట్టు చెప్పారు. ఈ కారణంగా బూత్ లెవెల్ అధికారులు అందరికీ ఎస్ఐఆర్‌పై తగిన శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. సమావేశంలో రూరల్ మండల తహసీల్దార్, ఎతఆర్వో ఎస్ఎల్ఎస్ కుమారి, డిప్యూటీ తహసీల్దార్లు రావు కళ్యాణ్‌చక్రవర్తి, సురేష్‌కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎంపీడీ భవాని, 264 మంది బూత్‌లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

బెనిఫిట్ షోలతో దోచుకోవడం తగదు

బోట్‌క్లబ్: సినిమా రిలీజ్ కోసం ఇష్టారాజ్యంగా టికెట్ ధరలు పెంచడం, బెనిఫిట్ షో రేట్లు అమలు చేస్తున్న నిర్వహణ వల్ల ధనవంతుల వ్యాపారాలకు ప్రభుత్వం కొమ్ము కాయడం మినహా సమాజానికి ఎటువంటి ప్రయోజనం లేదని పౌర సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు శనివారం ఒక ప్రకటనలో వాపోయారు. వీటి వల్ల సామాన్య, మధ్య తరగతి గృహాల్లో ఆర్థిక దోపిడీ జరుగుతుందన్నారు. తొలి రోజుల్లో సినిమా చూడాలన్న యువకుల ఉత్సాహాన్ని ఆసరాగా చేసుకుని ఆర్థిక వ్యాపార దృక్పథం చేయడం వలన ధనవంతుల ఖజానా నిండుతుందన్నారు. చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, వెంకటేష్, నాగార్జున, అల్లు అర్జున్ వంటి వారి సినిమాలు ఏమైనప్పటికీ నిర్మాతల కోసం తొలి రోజు ధరలు పెంచడం, బెనిఫిట్ షోలతో దోచుకోవడం తగదన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

తాళ్లరేవు: సమాజంలో రోజు రోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. వరల్డ్ ఫోరెన్సిక్ సైన్స్ డే సందర్భంగా జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు శనివారం పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో ఫోరెన్సిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా పోలీసులు పనిచేస్తున్నారని ప్రజలు సహకరించాలని కోరారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పైడా కళాశాల కరస్పాండెంట్ పైడా సత్య శ్రీరామ్, డీన్ ఎం.వీరభద్రరావు, ప్రిన్సిపాల్ పీవీ సూర్యప్రకాష్, ప్రొఫెసర్ రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ వర్షిణీ తదితరులు పాల్గొన్నారు.